క్లుప్తంగా

ఓటు హక్కును వినియోగించుకోవాలి



బెట్టితండాలో ఓటరు స్లిప్పులు పంపిణీ చేస్తున్న బీఎల్‌ఓ

పాలకవీడు: పార్లమెంట్ ఎన్నికల్లో ప్రతీ ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఎంపీఓ దయాకర్ అన్నారు. ఆదివారం ఆయన మండలంలోని వివిధ పోలింగ్ కేంద్రాలను పరిశీలించి మాట్లాడారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లకు అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. అలాగే మండలంలోని అన్ని గ్రామాల్లో ఓటర్లకు ఆయా పోలింగ్ కేంద్రాల ఇన్‌చార్జి బీఎల్‌ఓలు ఓటరు స్లిప్పులు పంపిణీ చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శులు, బీఎల్‌ఓలు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన



భూమి పూజలో పాల్గొన్న దాత భాషబోయిన భాస్కర్‌రావు

కోదాడరూరల్ : మండల పరిధిలోని ఎర్రవరంలో మాదిగ కులస్తుల ఆరాధ్య దైవమైన సత్తెమ్మతల్లి ఆలయ నిర్మాణానికి అదే గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు బాషబోయిన భాస్కర్‌రావు వారి తల్లిదండ్రులు జానకిరామయ్య, అనసూర్యమ్మల జ్ఞాపకార్థం రూ.2లక్షలను విరాళంగా అందజేశారు. తాజా మాజీసర్పంచ్ వీరేపల్లి సుబ్బారావు ముత్యాలమ్మ ఆలయ నిర్మాణం చేయించనున్నారు. ఆదివారం ఆ ఆలయ నిర్మాణానికు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా దాతలు మాట్లాడుతూ గ్రామంలో నిర్మించే ఆలయ అభివృద్ధికి తమవంతుగా సహాయ సహకారాలు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమాల్లో మాదిగ కులపెద్దలు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

తమ్మారంలో అగ్ని ప్రమాదం

హుజూర్‌నగర్ (చింతలపాలెం) : చింతలపాలెం మండలంలోని తమ్మారంలో ఆదివారం జరిగిన అగ్నిప్రమాదంలో వరి గడ్డి, చెట్లు దగ్ధమయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామ శివారులోని వరి పొలాలలో కొయ్యలకు నిప్పంటుకొని, సమీపంలోని వరి గడ్డి, చెట్లకు అంటుకుని కాలిపోయాయి. విషయం తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను ఆర్పడంతో ప్రమాదం తప్పింది.

అనారోగ్యంతో వ్యక్తి మృతి

హుజూర్‌నగర్ : అనారోగ్యంతో ఓ వ్యక్తి మృతిచెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. హుజూర్‌నగర్‌కు చెందిన దార అంజయ్య (70) మూడు రోజులుగా జ్వరంతో బాధపడుతున్నాడు. కుటుంబ సభ్యులు ఇంటి వద్దనే ఉంచి చికిత్స చేయిస్తుండగా పరిస్థితి విషమించి ఆదివారం మృతి చెందాడు. ఎండ వేడిమినికి తాళలేక మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

మఠంపల్లి : రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందగా మరొకరికి గాయాలయ్యాయి. మండలంలోని ఎర్రగట్టువద్ద ఆదివారం సాయంత్రం చోటు చేసుకున్న ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. హుజూర్‌నగర్ మండలం గోవిందాపురం గ్రామానికి చెందిన దగ్గుబాటి రామనర్సు (35) రాము ఇద్దరు తాపీవర్కర్లుగా పని చేస్తున్నారు. వీరు మఠంపల్లిలో గృహ ప్రవేశానికి వెళ్లి బైక్‌పై హుజూర్‌నగర్‌వైపు తిరుగు ప్రయాణమయ్యారు. ఈ క్రమంలో ఎర్రగట్టు వద్ద రోడ్డు పక్కన ఆగిఉన్న లారీని వేగంగా వచ్చి ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వారిని తొలుత హుజూర్‌నగర్ ఆస్పత్రికి అక్కడి నుంచి సూర్యాపేటకు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ రామనర్సు మృతిచెందాడు. రాము పరిస్థితి కూడా విషమంగా ఉండటంతో హైదరాబాద్‌కు తీసుకెళ్లారు. ఈ ఘటనపై ఫిర్యాదు అందలేదని మఠంపల్లి పోలీసులు తెలిపారు.

సూర్యక్షేత్రం సందర్శన



సూర్యక్షేత్రంలో కుటుంబ సభ్యులతో కలిసి పూజలు చేస్తున్న ఈఈ జీకేడీ ప్రసాద్

అర్వపల్లి : తిమ్మాపురంలోని అఖండజ్యోతి స్వరూప సూర్యనారాయణ స్వామి క్షేత్రాన్ని ఆదివారం సూర్యాపేట మున్సిపల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జీకేడీ ప్రసాద్ కుటుంబ సభ్యులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా సూర్యభగవానుడికి ప్రత్యేక పూజలు చేశారు. వారికి సూర్యక్షేత్ర విశిష్టతను క్షేత్ర వ్యవస్థాపకుడు, సౌర ఆరాధకుడు కాకులారపు జనార్దన స్వామి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు నరేష్, ఇంద్రారెడ్డి, అర్చకులు రామశర్మ, వేణుగోపాలశర్మ పాల్గొన్నారు.

ముమ్మరంగా పోల్ చిట్టీల పంపిణీ

- ఇంటింటికీ తిరిగి నేరుగా అందజేస్తున్న బీఎల్‌ఓలు
- ఓటుకు సంబంధించిన అన్ని వివరాలు ఆ పోల్ చిట్టీలోనే..
- కోదాడ నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 2,45,187



కోదాడలో పోల్ చిట్టీలను పంపిణీ చేస్తున్న తహసీల్దార్ సాయాగౌడ్

కోదాడరూరల్ : పార్లమెంట్ ఎన్నికల్లో పోలింగ్ శాతం పెంచేందుకు ఎన్నికల కమిషన్ ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా ప్రతి ఓటరు ఓటు వేసే విధంగా అవగాహన కల్పించడం, పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించడంతో పాటు ఓటరు ఎలాంటి ఇబ్బంది పడకుండా పోల్ చిట్టీల పంపిణీకి శ్రీకారం చుట్టింది. ఎలక్షన్ కమిషన్ ఆదేశాలకు పట్టణ, గ్రామాల్లో బీఎల్‌ఓలు ఇంటింటికీ తిరుగుతూ ఓటర్లకు పోల్ చిట్టీలను పంపిణీ చేసే కార్యక్రమాన్ని ఇటీవల ప్రారంభించి ముమ్మరం చేశారు. ఈ పోల్ చిట్టీలు ఉండటం ద్వారా ఓటరు నేరుగా పోలింగ్ బూత్‌లో వెళ్లి దానిని సిబ్బందికి అందజేస్తే వివరాలు నమోదు చేసుకొని ఓటు వేసే వీలుంటుంది. దీంతో క్యూలైన్లో ఎక్కువ సేపు నిలబడకుండా వెంటనే ఓటు ప్రక్రియ పూర్తవుతుంది.

అన్ని వివరాలు పోల్ చిట్టీలోనే..

ఓటరుకు సంబంధించిన అన్ని వివరాలు ఆ పోల్ చిట్టీలోనే ఉండే విధంగా వాటిని ముద్రించారు. ముఖ్యంగా ఓటరు పేరు, తండి లేదా భర్త పేరు, పోలింగ్ సెంటర్ పేరు, సంఖ్య, చిరునామా, ఓటరు జాబితా క్రమ సంఖ్య తదితర వివరాలన్నీ అందులోనే ఉన్నాయి. వాటితో పాటు పోలింగ్ రోజున ఓటరు పాటించాల్సిన నిబంధనలు అదే విధంగా ఎన్నికల ఉల్లంఘనలు జరిగినా, రాజకీయ పార్టీలు ఓటర్లను ప్రలోభాలకు గురి చేసిన ఫిర్యాదు చేసేందుకు రాష్ట్ర ఎన్నికల అధికారి వైబ్‌సైట్, టోల్ ఫ్రీ నంబర్‌ను కూడా ముద్రించారు. ఇక ఫొటో స్థానంలో క్యూఆర్ కోడ్ ముద్రించి దానిని స్కాన్ చేస్తే ఓటరు పూర్తి వివరాలు వచ్చేలా ఏర్పాటు చేశారు. పోల్ చిట్టీల వెనుకవైపు పోలింగ్ కేంద్రాన్ని సులువుగా గుర్తించేందుకు గూగుల్ మ్యాప్‌ను సైతం పొందు పరిచారు. గతంలో ఈ చిట్టీలను రాజకీయ పార్టీలు ముద్రించి ఇవ్వగా అవి అందరికీ అందకపోవడంతో ఓటర్లు ఇబ్బందులు పడేవారు. ఈ నేపథ్యంలో అలా జరగకుండా ఓటర్లకు సమాచారం ఇచ్చేలా ఎన్నికల సంఘం వీటిని ముద్రించి అందజేస్తుంది.

ప్రతి ఓటరు ఓటు హక్కు వినియోగించుకునేలా...



ప్రతి ఓటరు ఓటు హక్కు వినియోగించుకునేలా ఇప్పటికే అవగాహన కలిగించాం. అదే విధంగా ఓటరుకు ఓటు వేసేందుకు ఇబ్బంది లేకుండా అన్ని వివరాలతో కూడిన పోల్ చిట్టీల పంపిణీ కార్యక్రమాన్ని ముమ్మరం చేశాం. బీఎల్‌ఓలో పట్టణ, గ్రామాల్లో పోల్ చిట్టీలను అందజేసే కార్యక్రమంలో చురుగ్గా పాల్గొంటున్నారు. ఈ నెల చివరి నాటికి ఈ పంపిణీ పూర్తి అయ్యేలా చర్యలు చేపట్టాం.

– టి.సాయాగౌడ్, తహసీల్దార్, కోదాడ

నియోజకవర్గంలో 296 పోలింగ్ కేంద్రాలు

కోదాడ నియోజకవర్గంలోని మున్సిపాలిటీతో పాటు ఆరు మండలాల్లో కలిపి 296 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. మొత్తం ఓటర్లు 2,45,187 వారిలో స్త్రీలు 1,25,997 పురుషులు 1,97,172 థర్డ్ జెండర్‌లు 18 మంది ఉన్నారు. ఈ నెల చివరి నాటికి లేదా వచ్చే నెల మొదటి వారంలోగా అందరికీ ఈ చిట్టీలో అందేలా అధికారులు ప్రణాళిక రూపొందించారు.

● వానలు కురవాలని..



చిలుకూరు: వర్షాలు సమృద్ధిగా కురవాలని, వచ్చే ఖరీఫ్‌లో పంటలు బాగా పండాలని కోరుతూ చిలుకూరు మండలంలోని ఆర్లెగూడెం గ్రామంలో ఆదివారం బొడ్రాయికు నీళ్లు పోసి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఎండలు మండిపోతున్నాయని, వర్షాలు కురిసి వాతావరణం చల్లబడాలని కోరుతూ పూజలు నిర్వహించినట్లుగా గ్రామ పెద్దలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

గుండెపోటుతో ఉపాధ్యాయుడు మృతి



అంజద్ అలీఖాన్ (ఫైల్)

మోతె: గుండెపోటుతో ప్రభుత్వ ఉపాధ్యాయుడు మృతిచెందాడు. ఈ ఘటన ఆదివారం మోతె మండల కేంద్రంలో జరిగింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట పట్టణానికి చెందిన అంజద్ అలీఖాన్ (55) మోతె మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జీవశాస్త్ర ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు. ఆదివారం ఆయన ఇంట్లో నిద్రిస్తుండగా గుండెపోటుకు గురై మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులున్నారు. అంజద్ అలీఖాన్ మృతికి తోటి ఉపాధ్యాయులు, స్నేహితులు సంతాపం తెలిపారు.

లౌకిక ప్రజాస్వామ్య శక్తులను గెలిపించాలి



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీరాములు

మునగాల: మతతత్వ బీజేపీని ఈ పార్లమెంటు ఎన్నికల్లో ఓడించి లౌకిక ప్రజాస్వామ్య శక్తులను గెలిపించాలని సీపీఎం పార్టీ సీనియర్ నాయకులు బుర్రి శ్రీరాములు అన్నారు. ఆదివారం మండలంలోని నేలమర్రిలో బచ్చలకూరి రాందాసు అధ్యక్షతన జరిగిన సీపీఎం గ్రామశాఖ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం పదేళ్ల కాలంలో ప్రజా వ్యతిరేక చట్టాలను అవలంబిస్తూ రైతులకు వ్యతిరేకంగా మూడు నల్లచట్టాలను తెచ్చిందన్నారు. రైతులు 13నెలల పాటు చేసిన పోరాట ఫలితంగా ఆ చట్టాలను వెనుకకు తీసుకుందని తెలిపారు., రాజ్యాంగాన్ని మార్చే ప్రయత్నం చేస్తుందని ఆరోపించారు. సంపన్నులకు రాయితీలు ఇస్తూ ప్రజలపై అనేక భారాలను మోపుతుందని ఆరోపించారు. సమావేశంలో నాయకులు చందా చంద్రయ్య, బచ్చలకూరి రామ్‌చరణ్, బచ్చలకూరి స్వరాజ్యం, మండవ వెంకటాద్రి, మామిడి గోపయ్య, బట్టుపల్లి ఉపేందర్, జీడయ్య, కోటయ్య పాల్గొన్నారు.

బీజేపీ, బీఆర్‌ఎస్‌లను ఓడించాలి



సమావేశంలో మాట్లాడుతున్న అనంతప్రకాష్

పాలకవీడు: పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలను ఓడించాలని సీపీఎం మండల కార్యదర్శి అనంతప్రకాష్ పిలుపునిచ్చారు. ఆదివారం అయయన మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన పార్టీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తుందని, రాజ్యాంగ విలువలను కాలరాస్తూ మతచాందస వాదంతో ప్రజల్లో చిచ్చు పెడుతున్నారన్నారు. బీఆర్ఎస్ పార్టీ గతంలో అవినీతి సామ్రాజ్యాన్ని నెలకొల్పి రాష్ట్రాన్ని అప్పులకుప్పగా మార్చిందన్నారు. ఈ రెండు పార్టీలకు ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని మిర్యాలగూడలో సోమవారం జరగనున్న ఎన్నికల విస్తృతస్థాయి సమావేశానికి పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని కోరారు. సమావేశంలో సీపీఎం నాయకులు గుర్రం ధనమూర్తి, దిద్దకుంట్ల పురుషోత్తంరెడ్డి, సన్నెపంగు రమేష్, యరడ్ల మల్లారెడ్డి, ఆర్లపూడి వీరభద్రం పాల్గొన్నారు.

బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దింపాలి



సమావేశంలో మాట్లాడుతున్న పల్లె వెంకటరెడ్డి

మేళ్లచెరువు : దేశంలో పదేళ్లుగా ప్రజా,రైతు,కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న కేంద్ర ప్రభుత్వాన్ని గద్దె దింపాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు పల్లె వెంకటరెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం మండలకేంద్రంలో నిర్వహించిన ఆ పార్టీ మండల కమిటీ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. సామాన్యులపై పన్నుల భారం మోపుతూ కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా కార్మికచట్టాలు చేస్తూ ,దేవుళ్ల పేరుతో మూడోసారి అధికారంలోకి రావాలని చూస్తున్న బీజేపీ ఓడించేందుకు ప్రజలు సిద్ధం కావాలన్నారు. బీఆర్ఎస్, బీజేపీలు లోపాయకార ఒప్పందంతో ప్రజలను మోసం చేయడానికి చూస్తున్నారని ఆరోపించారు. తాగు నీటి సమస్యను పరిష్కరించేందుకు అధికారులు కృషి చేయాలన్నారు. సమావేశంలో శీలం శ్రీను, మండలకార్యదర్శి వట్టెపు సైదులు, గుండు సైదులు, బాలాజీ, ఆదినారాయణ, అశోక్, ప్రకాశ్, భిక్షపతిరావు, ఆనంద్, గోవింద్, సాంభయ్య తదితరులు పాల్గొన్నారు.

లోక్‌సభ ఎన్నికల్లో మతోన్మాద శక్తులకు బుద్ధి చెప్పాలి



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వర్‌రావు

నేరేడుచర్ల : లోక్‌సభ ఎన్నికల్లో మతోన్మాద బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ శక్తులకు బుద్ధి చెప్పాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు గోకినేపల్లి వెంకటేశ్వర్‌రావు అన్నారు. ఆదివారం నేరేడుచర్లలోని రవన్న నగర్‌లో జరిగిన మాస్‌లైన్ జిల్లా కమిటీ జనరల్ బాడీ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. పదేళ్లుగా బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ ప్రజలను నిలువు దోపిడీ చేస్తున్నాయని ఆరోపించారు. దేశాన్ని హిందూ రాజ్యంగా మార్చాలని చూస్తున్నారని అన్నారు. దేశ సంపదనను అంబానీ, అదానీలకు దోచుకునేందుకు అవకాశం కల్పించారని, ప్రజా సమస్యలను పరిష్కరించలేని పాలక ప్రభుత్వాలు ప్రజల మధ చిచ్చుపెడుతున్నాయని ధ్వజమెత్తారు. ఈ ఎన్నికల్లో లౌకిక ప్రజాతంత్ర శక్తులకు సంపూర్ణ మద్దతు ఇవ్వాలన్నారు. మాస్‌లైన్ హుజూర్‌నగర్ డివిజన్ కన్వీనర్ వాస పల్లయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఓపీడబ్ల్యూ జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి రేణుక, పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి అఖిల్‌కుమార్, నాయకులు పేర్ల నాగయ్య, కారింగుల వెంకన్న, లక్ష్మయ్య, మారసాని చంద్రకళ, సూరం రేణుక, జయమ్మ, కరుణాకర్, శ్రీను, పావని, సత్యే, మరియమ్మ, లక్ష్మి తదితరులున్నారు.

వాహనాల తనిఖీ

నడిగూడెం : వచ్చే నెల 13న జగరనున్న పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా మండలంలో పలు చోట్ల వాహనాలను నడిగూడెం పోలీసులు ముమ్మరంగా తనిఖీలు చేస్తున్నారు. ఆదివారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ ఎదురుగా నడిగూడెం మీదుగా వచ్చి వెళ్లే వాహనాలను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ అజయ్ కుమార్, పాల్గొన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

నేరేడుచర్ల : నేరేడుచర్ల మండలం పెంచికల్‌దిన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2004–2005 సంవత్సర పూర్వ విద్యార్థులు ఆదివారం స్థానికంగా సమ్మేళనమయ్యారు.ఈ సందర్భంగా ఆనాటి మధుర స్మృతులను గుర్తు తెచ్చుకున్నారు. అనంతరం గురువులను శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మేడేను విజయవంతం చేయాలి



హుజూర్‌నగర్‌లో సమావేశమైన టీఆర్‌ఎస్‌కేవీ అనుబంధ సంఘం నాయకులు

హుజూర్‌నగర్: మేడేను విజయవంతం చేయాలని నియోజకవర్గం కార్మిక సంఘం అధ్యక్షుడు పచ్చిపాల ఉపేందర్ అన్నారు. ఆదివారం ఆయన పట్టణంలో టీఆర్‌ఎస్‌కేవీ అనుబంధ సంఘం బజార్ హమాలీ సంఘం జనరల్‌బాడీ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో టీఆర్ఎస్‌కేవీ నాయకులు, హమాలీ సంఘం సభ్యులు ముసంగా శ్రీను, వెంకన్న, రామయ్య, బాలకృష్ణ, వీరబాబు, కోటేశ్వరరావు, దనయ్య, నరసింహారావు, లింగయ్య పాల్గొన్నారు.

జయప్రదం చేయాలి

కోదాడరూరల్ : మేడే వేడుకలను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు ఎం .ముత్యాలు కార్మికులకు పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలో సీఐటీయూ ఆధ్వర్యంలో వివిధ కార్మిక సంఘాల నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అనేక పోరాటల ద్వారా సాధించుకున్న కార్మికుల హక్కులను కేంద్ర ప్రభుత్వం కాలరాస్తుందన్నారు. కార్మికులు ఐక్యంగా ఉండి జరగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. మేడ సందర్భంగా గ్రామ, పట్టణాల్లో ఎర్రజెండాలు ఎగరవేసి, ర్యాలీలు నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో మన్యం లింగయ్య, సత్తిరెడ్డి, వెంకన్న, సైదులు, నాగరాజు, శ్రీనివాస్, కొండలు ఉన్నారు.

మేడే పోస్టర్ల ఆవిష్కరణ



గరిడేపల్లి : పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

గరిడేపల్లి : మేడేను విజయవంతం చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు కామల్ల శ్రీను అన్నారు. ఆదివారం మండల పరిధిలోని వెలిదండ గ్రామంలో హమాలీ కార్మిక సంఘం భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో మేడే పోస్టర్లను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మే ఒకటి నుంచి 7వరకు పట్టణాలు, గ్రామాల వాడవాడలా మేడే కార్యక్రమాలు నిర్వహించాలని కార్మికులకు పిలుపునిచ్చారు. బీజేపీ ప్రభుత్వం కార్మిక హక్కులను కాలరాస్తుందన్నారు. పోరాడి సాధించుకున్న 44చట్టాలను నరేంద్రమోదీ ప్రభుత్వం నాలుగు కోడ్‌లుగా మార్చి కార్మికుల పొట్ట కొడుతుందన్నారు. జరగబోయే ఎన్నికల్లో బీజేపీని ఓడించి మోదీని గద్దెదించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు మేకల కనకారావు, గండు నాగేశ్వరావు, రమేష్, చింతమళ్ల అంజయ్య, ముత్తయ్య, సాంబయ్య, అంజయ్య, సువార్త, సంతోష్, సైదులు, రేణుక, నాగయ్య పాల్గొన్నారు.

మూగజీవాలకు నీటి వసతి



వేపలసింగారం : తొట్టిలో నీరు నింపుతున్న గ్రామ పంచాయతీ సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని వేపలసింగారంతో పాటు ఆయా గ్రామాల్లోని తొట్లలో గ్రామ పంచాయతీ సిబ్బంది నీటిని నింపారు. అల్లాడుతున్న మూగజీవాలు శీర్షికన ఆదివారం సాక్షిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఆయా గ్రామాల్లో ఉన్న తొట్లలో నీటిని నింపించి పశువులకు ఇబ్బంది లేకుండా చూడాలని సంబంధిత అధికారులకు సూచించారు.



ఊరచెరువులో దిగబడిన గేదెలను బయటకు లాగుతున్న రైతులు

చెరువులో దిగబడిన గేదెలు

మండలంలోని వేపలసింగారంలో గల ఊరచెరువులో నాలుగు గేదెలు నీటి కోసం వెళ్లి చెరువులో దిగబడ్డాయి. అటుగా వెళ్లిన గ్రామస్తులు గమనించి ఫొటోలు తీసి సోషల్ మీడియాలో వైరల్ చేయడంతో గేదెలను గుర్తించిన సంబంధిత రైతులు ట్రాక్టర్ సహాయంతో వాటని బయటకు తీశారు. మూగజీవాల యజమానులు తమ పశువులను బయటకు వదిలేటప్పుడు అవి ఎటు వెళుతున్నాయో గమనించాలని పలువురు గ్రామ పెద్దలు సూచించారు.

పోలింగ్ శాతం పెంపునకు కృషి చేయాలి

- ఎన్నికల సాధారణ పరిశీలకుడు మనోజ్‌కుమార్ మాణిక్‌రావు సూర్యవంశీ

నేరేడుచర్ల: లోక్‌సభ ఎన్నికల్లో ఓటింగ్ శాతం పెరిగేలా ఎన్నికల అధికారులు కృషిచేయాలని నల్లగొండ లోక్‌సభ నియోజకవర్గ ఎన్నికల సాధారణ పరిశీలకుడు మనోజ్‌కుమార్ మాణిక్‌రావు సూర్యవంశీ అన్నారు. ఆదివారం ఆయన నేరేడుచర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌లను పరిశీలించి మాట్లాడారు. ప్రతి పోలింగ్ బూత్‌లో కొత్త ఓటర్ల నమోదు వివరాలు, చనిపోయిన ఓటర్ల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం చిల్లేపల్లి చెక్‌పోస్ట్ వద్ద వాహనాల తనిఖీలను పరిశీలించి ప్రతి వాహనాన్ని క్షుణంగా తనిఖీ చేయాలని పోలీసులను ఆదేశించారు. ఆయన వెంట నేరేడుచర్ల తహసీల్దార్ సురగి సైదులు, మున్సిపల్ కమిషనర్ అశోక్‌రెడ్డి, బీఎల్‌ఓలు తులసి, అనంత లక్ష్మి, సరిత తదితరులున్నారు.

పోలింగ్ స్టేషన్‌లలో వసతులు కల్పించాలి

గరిడేపల్లి: పోలింగ్ స్టేషన్‌లలో వసతులు కల్పించడంపై అధికారులు దృష్టి సారించాలని ఎన్నికల సాధారణ పరిశీలకుడు మనోజ్‌కుమార్ మాణిక్‌రావు సూర్యవంశీ అన్నారు. ఆదివారం గరిడేపల్లి మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోలింగ్ కేంద్రాలలో ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. ఎన్నికల నియమావళిని అధికారులు, సిబ్బంది అనుసరించాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ బండ కవిత, వీఆర్‌ఓ రాంబాబు, బీఎల్‌ఓ సూపర్‌వైజర్ పిచ్చమ్మ, బీఎల్‌ఓలు రావుల వెంకన్న, మందాది ఉమ, రవీందర్‌రెడ్డి, సైదమ్మ పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి



విద్యార్థులకు షీల్డ్‌లను అందజేస్తున్న దాత నరసింహారెడ్డి దంపతులు

కోదాడరూరల్ : విద్యార్థులు చదువుల్లో రాణించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని మండలంలోని రామలక్ష్మీపురానికి చెందిన అన్నెం నరసింహారెడ్డి స్రవంతి దంపతులు అన్నారు. ఆదివారం ఇంటర్‌లో ప్రతిభ చూపిన గ్రామానికి చెందిన పలువురు విద్యార్థులకు స్థానిక పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యాభవిష్యత్ ప్రతిభా పురస్కారాలను అందజేశారు. వారి తల్లిదండ్రులను సన్మానించి మాట్లాడారు. చదువుల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు తమ ప్రొత్సాహం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో అన్నెం పాపిరెడ్డి, ఉపాధ్యాయులు బడుగుల సైదులు, లెక్చరర్ బుడిగ వీరబాబు, భాస్కర్, జ్యోతి, బాలనాగిరెడ్డి, నరసింహారెడ్డి, వీరనాగిరెడ్డి, లక్ష్మారెడ్డి, వెంకట్‌రెడ్డి, పాపిరెడ్డి ఉన్నారు.

కూరగాయల సాగుపై ఆసక్తి

- చిలుకూరు మండలంలో సుమారు 20ఎకరాల్లో సాగు
- పంట ఉత్పత్తులను స్వయంగా విక్రయించుకుంటున్న రైతులు
- సబ్సిడీపై విత్తనాలు, పురుగు మందులు అందించాలని గిరిజన రైతుల వినతి



చిలుకూరు మండలం దూదియాతండాలో ఆకు కూరల, బెండ సాగు

చిలుకూరు : వేసవిలో ఆకుకూరలు, కూరగాయలకు ఎక్కువ డిమాండ్ ఉండడంతో చిలుకూరు మండలంలోని పలు తండాల్లోని గిరిజన రైతులు వాటి సాగుకు ఆసక్తి చూపుతున్నారు. మండలంలోని జానకీనగర్, దూదియాతండా, శీత్లాతండా గ్రామాల్లో గిరిజన రైతులు ఎక్కువగా ఆకుకూరలు, కూరగాయల సాగు చేస్తున్నారు. ఆయా గ్రామాల్లో తమకున్న కొద్ది పాటి భూముల్లో బోర్లు, వ్యవసాయ బావుల కింద 5 గుంటలు, 10 గుంటల్లో వీటిని సాగు చేస్తూ అధిక దిగుబడులు సాధిస్తున్నారు. ప్రతి సంవత్సరం ఈ గ్రామాల్లో దాదాపుగా 50మందికి పైగా రైతులు 20 ఎకరాల్లో ఆకుకూరలు, వివిధ రకాల కూరగాయలు సాగు చేస్తున్నారు.

స్వయంగా మార్కెటింగ్

గిరిజన తండా రైతులు తాము పండించిన పంట ఉత్పత్తులను స్వయంగా విక్రయించుకుంటున్నారు. గతంలో దళారులకు అమ్మి తీవ్రంగా నష్టపోయామని అందుకు తామే స్వయంగా అమ్ముకుంటున్నామని పలువురు గిరిజన రైతులు అంటున్నారు. ప్రస్తుతం ఆకు, కూరగాయలను సాగు చేస్తున్న గిరిజన తండా రైతులు ఉదయం పూట పురుషులు మోటార్ బైక్‌లపై వివిధ రకాల ఆకు, కూరగాయలను కట్టుకొని చిలుకూరు మండలంలోని పలు గ్రామాల్లో, హుజూర్‌నగర్, కోదాడ పట్టణాల్లో విక్రయిస్తున్నారు. మహిళలు గంపలతో ఇంటింటికీ తిరుగుతూ తండాల చుట్టు పక్కల గ్రామాల్లో అమ్ముతుంటారు. ప్రధానంగా గిరిజన రైతులు గోంగూర, బచ్చలకూర, తోటకూర, పాలకూర, పూదినా, కొత్తిమీర లాంటి తదితర ఆకుకూరలు, వంకాయలు, దొండకాయలు, బెండకాయలు, దోసకాయలు లాంటి కూరగాయలు సాగు చేస్తూ అమ్ముకుంటున్నారు. ఆకు కూరలను ప్రతి పది రోజుల ఒక సారి కోసి కట్టలు కట్టి విక్రయిస్తామని పలువురు గిరిజన రైతులు తెలిపారు. వర్షాకాలంలో అయితే కట్ట రూ.3 నుంచి రూ. 5 ఉంటే ప్రస్తుతం వేసవి కాలంలో అదే ఆకుకూర కట్టను రూ.7 నుంచి రూ. 10 అమ్ముతున్నామని వారు తెలిపారు.

పదిహేను రోజుల్లోనే కోతకు..

ఆకుకూరలు విత్తనాలు చల్లిన వెంటనే మూడు రోజులకు ఒక సారి నీళ్ల తడి పెడితే వారం రోజుల్లో మొక్కలు పెరుగుతాయని, దానికి అనుగుణంగా యూరియా వేస్తే పదిహేను రోజుల్లో ఆకుకూరలు కోతకు వస్తాయని తెలిపారు. అదే కూరగాయలు సాగు చేస్తే పెట్టుబడులు ఎక్కువైనా ఆదాయం కూడా అందుకు అనుగుణంగా ఉంటుందని అంటున్నారు. కూరగాయల సాగుకు పెట్టుబడి ఎకరానికి రూ. 10 వేల నుండి రూ. 15వేల వరకు ఉంటుందని అంటున్నారు. ప్రభుత్వం ఆకు, కూరగాయల సాగుకు కావాల్సిన విత్తనాలను సబ్సిడీపై అందిస్తే ఇంకా మరి కొంత మంది రైతులు ఈ సాగుపై ఆసక్తి చూపుతారని అంటున్నారు. ఇప్పటికైనా వ్యవసాయ శాఖ అధికారులు స్పందించి ఆకు, కూరగాయల సాగు చేసే రైతులను సబ్సిడీపై విత్తనాలు, పురుగు మందులు పంపిణీ చేయాలని పలువురు గిరిజన రైతులు కోరుతున్నారు.